ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

'మొక్క'వోని నిర్లక్ష్యం

- మోడుబారుతున్న రోడ్డు పక్క మొక్కలు
- సంరక్షణకు నిధులు కేటాయించిన ప్రభుత్వాలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు వాటి సంరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) నిధులతో చేపడుతున్న ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటుతున్న మొక్కలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. నాటిన మొక్కలకు అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వాలు నిధులు విదల్చకపోవడం సమస్యగా మారింది. 30 శాతం మొక్కలు మోడుబారిపోతున్నాయి.

ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరం వరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రతి ఏటా సగటున 400 గ్రామాల్లో వెయ్యి కిలోమీటర్ల రోడ్ల వెంట ఐదు లక్షలు మొక్కలు నాటారు. రోడ్డు పక్క నాటడానికి అవసరమైన మొక్కలను కడియం నర్సరీ నుంచి కొనుగోలు చేశారు. ఆరు అడుగులు ఎత్తు వరకు పెరిగిన నీడనిచ్చే మొక్కను రూ.90కి కొనుగోలు చేశారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వెచ్చించి ఈ మొక్కల సంరక్షణకు ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని అందించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి ఎవెన్యూ ప్లాంటేషన్‌లో ప్రభుత్వాలు మార్పులు చేశాయి. అటవీశాఖ నర్సరీల్లో అభివృద్ధి చేసి ఉచిత పంపిణీకి సిద్ధంగా ఉంచిన నేరేడు, మద్ది, వేప, గానుగ, పసుపు, ఎరుపు తురాయి మొక్కలు మాత్రమే నాటాలని ప్రభుత్వాలు మార్గదర్శకాలు విడుదల చేశాయి. జిల్లా పునర్విభజన తర్వాత ప్రతి ఏటా 25 మండలాల్లో రోడ్డుపక్కన 30 కిలోమీటర్ల పరిధిలో మొక్కలు నాటుతున్నారు. రోడ్డుకు ఒకవైపున అయితే కిలో మీటరుకు 200, రెండు వైపులా అయితే 400 మొక్కలు నాటుతున్నారు. సగటున 9 వేల మొక్కలు మాత్రమే నాటుతున్నారు. మొక్కలకు నీరు అందించడానికి మెటీరియల్ కాంపోనెంట్ నిధులను నిలిపివేశారు. వివిధ కారణాలతో ఉపాధి చట్టంలో పని దినాలను మొక్కలకు నీరు పోసేందుకు ఉపయోగించడం లేదు. దీంతో నాటిన వాటిల్లో సగటున 30 శాతం అంటే 2,700 మొక్కలు చనిపోతున్నాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అంచనా. ఇలా చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి కొత్తవాటిని నాటడం, ఆ మొక్కలు మరలా చనిపోవడం గత మూడేళ్లుగా జరుగుతోంది. ఈ క్రమంలోనే ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల సంరక్షణకు ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించాల్సి ఉంది.

దాములూరు గ్రామంలో మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

మొక్కజొన్నను కొనేవారేరీ?

ప్రజాశక్తి-నందిగామ

అతివృష్టి పరిస్థితుల్లో ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నను కొనేవారు లేకపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో మద్దతు ధర అందట్లేదు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో పది వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవల మొంథా తుపాను వల్ల చేతికి వచ్చిన పంట దెబ్బతింది. ఎకరాకు 20 నుంచి 30 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా అధిక వర్షాల వల్ల కేవలం 15 నుంచి 20 బస్తాల్లోపే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,380 మద్దతు ధర ప్రకటించింది. మార్క్‌ఫెడ్ జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీనివల్ల మద్దతు ధర అందట్లేదు. ఫలితంగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.1800కే అడుగుతున్నారు. ఈ ధరకు ఇవ్వలేక రైతులు ఇళ్లల్లోనే నిల్వ చేస్తున్నారు. నందిగామ, కంచికచర్ల మండలాల్లో ఆల్కహాల్ తయారీ పరిశ్రమలు ఉన్నా మద్దతు ధర అందక రైతులు నష్టపోతున్నారు. దళారులు తక్కువ ధరకే అడుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలు

- కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్త కావాలన్నదే లక్ష్యం
- మహిళల ఆర్థిక పరిపుష్టికి చర్యలు
- ఎన్‌టిఆర్ జిల్లా మెప్మా పీడీ మురళీకృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజల జీవనోపాధి మెరుగుదల, పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు జరుపుతున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఎన్‌టిఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పాతూరి మురళీకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల మహిళలు స్వయంశక్తితో ఆర్థిక పరిపుష్టి సాధించడానికి పలు పథకాలు అమలవుతున్నాయని అన్నారు. బ్యాంక్ లింకేజీ రుణ సదుపాయం, ప్రతి కుటుంబంలోని ఒకరు వ్యాపార వేత్త కావాలని, మహిళాకాశం, డిజి లక్ష్మీ తదితర స్కీమ్స్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ప్రతి కుటుంబంలోని మహిళలకు ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందన్నారు. పేదరిక నిర్మూలన కోసం పట్టణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న వివిధ రకాల స్కీమ్స్, వాటి పురోగతిపై మురళీకృష్ణ ప్రసాద్ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: మహిళలకు ఎన్ని కోట్లు బ్యాంక్ లింకేజీ రుణ సదుపాయం కల్పిస్తున్నారు?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, కొండపల్లి మునిసిపాలిటీల్లోని ఎస్‌హెచ్‌జి మహిళలకు రూ.75 కోట్ల మేర బ్యాంక్ లింకేజీ రుణసదుపాయం కల్పించడం జరుగుతుంది. జిల్లాలో 445 ఎస్‌హెచ్‌జిలో 44,500 మంది స్వయం సహాయక సభ్యులున్నారు. జిల్లాలో 160 ఎస్‌ఎల్‌ఎఫ్ (స్లమ్ లెవల్ ఫెడరేషన్), నాలుగు టిఎల్‌ఎఫ్ (టౌన్ లెవల్ ఫెడరేషన్) ఉన్నాయి.

ప్రశ్న: మహిళాకాశం స్కీమ్ ఎలా అమలవుతుంది?

జవాబు: ఈ పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించి (మిగతా 2లో)

డ్రగ్స్ వద్దు... ఆరోగ్యమే ముద్దు

సైకిల్ ర్యాలీలో డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా

ప్రజాశక్తి-విజయవాడ

డ్రగ్స్ అంతం కోసం ప్రతిఒక్కరు బాధ్యతగా ఉంటూ పోలీసు శాఖతో భాగస్వామ్యం కావాలని డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా పిలుపునిచ్చారు. రాష్ట్ర ఈగల్ (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూపు ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) విభాగాధిపతి ఇన్స్పెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ రవికృష్ణ ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా - సండే ఆన్ సైకిల్ ర్యాలీ'లో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో- సైకిల్ తొక్కు బ్రో అనే నినాదంతో విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి సాగు నియంత్రణలోకి వచ్చినా, వినియోగం ఇంకా కొనసాగుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం ఆపేందుకు సమాజం కూడా ముందుకు రావాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉందదన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలు భాగస్వామ్యములు కావాలి కోరారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు తెలిపారు. ఎవరికైనా డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈగల్ ఐజీపీ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈగల్‌ను ఏర్పాటు చేసి డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కట్టుబడి ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 869 హాట్‌స్పాట్‌లు గుర్తించి, అక్కడ నిఘా పెంచినట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ డ్రగ్స్‌ను పూర్తిగా సమాజం నుంచి తరిమికొట్టాలన్నారు. విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో పిట్ ఎన్‌డిపిఎస్ అమలు చేసి 27 మందిని జైలుకు పంపించామని తెలిపారు. జిల్లాలో 43 డ్రోన్లు, 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరస్తులపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డీసీపీ సరిత, ఈగల్ ఎస్పీలు మహేశ్వరరాజు, కె.నగేష్‌బాబు , ఎన్టీఆర్ జిల్లా నార్త్ డివిజన్ ఏసిపి స్రవంతి రాయ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా

లోపలి పేజీల్లో

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలి

పెసర రైతుకు కష్టం..!

ప్రజాశక్తి-వీరులపాడు: నందిగామ డివిజన్లో పెసలు కొనేవారు లేక రైతుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. బహిరంగ మార్కెట్లో పెసలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. మద్దతు ధర కంటే మార్కెట్ ధర చాలా తక్కువగా ఉంది. వ్యాపారులు క్వింటా రూ.7 వేలకు మించి కొనడం లేదు. మద్దతు ధర రూ. 8768 కావడంతో కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రపకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బెడద, పెరిగిన పెట్టుబడులతో ఆరుగాలం శమించి పంటను పండించిన రైతులకు పంట అమ్ముకోవడంలో కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్లో పండించిన పెసర పంట చేతికొచ్చి మూడు నెలలు దాటినా పంటను అమ్ముకోలేక రైతులు దిక్కులు చూస్తున్నారు. పశ్చిమ కృష్ణాలో ప్రధానంగా నందిగామ, జగ్గయ్యపేట పలు మండలాల్లో పెసర పంట అధికంగా సాగు చేస్తారు. పెసర పంట సాగు చేయడం వల్ల మిగతా పంటలకు పెట్టుబడికి ఉపయోగపడతాయని రైతులు ఆశిస్తూ పెసర పంట సాగు వైపు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మూడు వేల హెక్టార్లకుపైగా పెసర పెంట సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వీరులపాడు, కంచికచర్ల మండలాల్లో సాగులో ఉంది. అనేక కష్టాలు, నష్టాల నడుమ పండించిన పంట రైతుల చేతికొచ్చి మూడు నెలలు దాటింది. ప్రభుత్వం పెసరకు మద్దతు ధర కింటాకు రూ.8768 రూపాయలుగా నిర్ణయించింది. కానీ అధికారులు ఇంతవరకు రైతులు వద్ద ఉన్న పెసలను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేయట్లేదు. ఇతర పంటలు పెట్టుబడులకు ఉపయోగపడుతుందనుకున్నా.. పెసర సకాలంలో అమ్ముకోలేక రైతులు తిరిగి పెట్టుబడులకు ఇతర మార్గాల్లో ప్రయత్నిస్తున్నారు. పంటను నెలల ఇళ్లల్లో ఉంచుకోలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటను కొనుగోలు చేయాలి

కొండవీటి నాగేశ్వరరావు, చౌటపల్లి గ్రామం, రైతు

ఐదు ఎకరాల్లో పెసర పంట సాగుచేశారు. పంట చేతికి రాగానే ఇస్తామంటూ పెట్టుబడికి డబ్బులు

తీసుకొచ్చాం. తీరా కొనేవారు లేక పంట అలాగే ఉంది. ఇతర పంటలకు పెట్టుబడి కోసం అప్పు ఇచ్చేవారేలేరు. పెసర పంటను కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నాను

రైతులను ఆదుకోవాలి

చలమాల దుర్గారావు, రైతు

ఎనిమిది ఎకరాల్లో వేసిన పెసర పెంటకు బాగా పెట్టుబడి అయింది. ఎకరానికి రూ.15 వేల చొప్పున కౌలు తీసుకుని పంటవేశా. బయట వడ్డీ చేసి పంటను సాగుచేశారు. ఇప్పుడు వాటికి వడ్డీ కూడా వచ్చే పరిస్థితిలేదు. అధికారుల నిర్లక్ష్యం మాకు శాపంగా మారింది. వెంటనే పెసలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

అధ్వానంగా రోడ్డు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని ముఖద్వారంగా ఉన్న ఉండవల్లిలో పంచాయతీ కార్యాలయం సమీపంలో వెయ్యి గజాల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఉండవల్లి సెంటర్ నుండి పంచాయతీ కార్యాలయం

వరకు, హిందూ శ్మశానం వాటిక నుండి పెనుమాక వరకు డబల్ నైన్ రోడ్డు వేశారు. ఈ మధ్యలో ఉన్న సుమారు వెయ్యి గజాల పొడవు గల రోడ్డు వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఇక్కడ సింగిల్ లైన్ రోడ్డు మాత్రమే వేశారు. డబుల్ లైన్ రోడ్డు వేద్దామనుకున్నా వివిధ కారణాలతో ముందుకు కదల్లేదు. ఈ క్రమంలో వెయ్యి గజాల రోడ్డు దాటడానికి ఐదు నిమిషాల సమయం పడుతుంది. అమరావతికి విజయవాడ నుంచి వెళ్లాలంటే ఉన్న ప్రధాన మార్గంలో పరిస్థితి ఎలా ఉందో ఈ రోడ్డును చూస్తే అర్థమవుతుందని ప్రజలంటున్నారు. గుంతల్లో పడి లేస్తూ వాహనదారులు లబోదిబో మంటున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి.

మొదటిపేజీ తరువాయి

పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలు

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ఎంతగానో తోడ్పాటునందిస్తుంది. ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూత ద్వారా అన్ని రకాలుగా గ్రూపుల్లోని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించవచ్చు. స్కీమ్ సక్రమంగా అమలు కోసం పట్టణ స్థాయిలో ఆర్‌పిలు, సిఒలు, సిఎంఎం అలాగే టిఇలు పర్యవేక్షిస్తుంటారు.

ప్రశ్న: కుటుంబంలో ఒక 'వ్యాపారవేత్త' స్కీమ్ తీరు ఎలా ఉంది?

జవాబు: ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్త కావాలనే లక్ష్యంతో... పట్టణ ప్రాంతాల్లో యుఎల్‌బి స్థాయిలో నుంచి తయారయ్యేందుకు పలు రూపాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ఆధారంగా మహిళలకు చేయూతనందించడం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్త లక్ష్యంలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాకు 697 మందిని వ్యాపార వేత్తలుగా చేయాలని ప్రభుత్వం టార్గెట్ నిర్ణయించింది. జగ్గయ్యపేట మునిసిపాలిటీలో 173 మంది, కొండపల్లి మునిసిపాలిటీలో 180, నందిగామ మునిసిపాలిటీ 213, అలాగే తిరువూరు మునిసిపాలిటీకి 131 మందిని వ్యాపారవేత్తలు చేయాలని లక్ష్యం నిర్దేశించడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆర్.పిల ద్వారా పట్టణాల్లో సర్వే నిర్వహించి, ఎంపిక చేయడం జరుగుతుంది. ఇప్పటికే 148 మందిని ఎంపిక చేయడం, వారికి లోను మంజూరు చేయడం కూడా జరిగింది. ముఖ్యంగా వారి వారి అభిరుచి, ఇష్టాన్ని బట్టి ఫ్యాన్సీషాపు, క్యాంటిన్, చికెన్ షాపు, స్వీట్ షాపు ఇలా ప్రతి మహిళకు వ్యాపారాలు పెట్టించడం జరుగుతుంది. వారు పొందిన రుణాలను ఐదు సంవత్సరాల లోపులో రికవరీ చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క యూనిట్‌కు రూ. రెండు లక్షల నుంచి ఆపైన రూ. 25 లక్షల వరకు కూడా బ్యాంక్‌ల నుంచి లోను సదుపాయం కల్పించడం జరుగుతుంది.

ప్రశ్న: వీధి వ్యాపారుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: పట్టణాల్లో వీధి వ్యాపారులను గుర్తించి, వారికి అన్ని రకాలుగా చేయూతనందించడం జరుగుతుంది. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో 2,993 మంది వీధి వ్యాపారులను గుర్తించడం, వారికి గుర్తింపుకార్డులు కూడా మంజూరు చేశాం. మొదటి దశలో రూ. 50 వేలు, రెండవ దశలో రూ. 25000, మూడవ దశలో 50 వేలు బ్యాంక్‌ల నుంచి రుణ సదుపాయం కల్పించడం జరుగుతుంది. రెండవ దశలో 1416 మందిని, మూడవ దశలోని 926 మందిని గుర్తించడం, మూడు దశల్లో మొత్తంగా 5,335 మందికి బ్యాంక్‌ల ద్వారా రుణ సదుపాయం కల్పించబడుతుంది. రూ. 30 వేల మేర క్రెడిట్ కార్డును కూడా ప్రతి వీధి వ్యాపారి వినియోగించుకోవచ్చు. 2024లో ప్రారంభమైన ఈ స్కీమ్ 2031 వరకు అమలులో ఉంటుంది. ఈ స్కీమ్ ద్వారా వీధి వ్యాపారులను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుంది.

ప్రశ్న: డిజి లక్ష్మీ పథకం ఉద్దేశమేమిటి?

జవాబు: ప్రస్తుతం పెరిగిన టెక్నాలజీ నేపథ్యంలో ప్రతి రంగంలో కానీ, ప్రతి శాఖలో డిజిటల్ పేమెంట్స్ చెల్లింపులు జరుగుతున్న క్రమంలో, టెక్నికల్‌గా అనుభవం ఉన్న మహిళలను గుర్తించి, వారికి ఈ స్కీమ్‌ను వర్తింప చేయడం జరుగుతుంది. విద్యుత్ బిల్లులు చెల్లింపులు, రైల్వే టికెట్స్, ఆర్టీసి టికెట్స్, పోస్టల్, తదితర శాఖల కార్యకలాపాల్లో డిజిటల్ పేమెంట్స్ ట్రాన్సాక్షన్ జరిగే విధంగా ఎస్ఎల్ఎఫ్ స్థాయిలో మహిళలకు అవకాశం కల్పించడం జరుగుతుంది. షాపు ఏర్పాటు చేసుకొని, దానుంచి డిజిటల్ పేమెంట్స్ జరిగే విధంగా చూడటం, తద్వారా మహిళలకుత జీవనోపాధి కల్పించినట్లవుతుంది.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయవాడ: సూర్యారావుపేటలోని డాక్టర్ అర్చన కిడ్నీ అండ్ స్కిన్ కేర్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని డాక్టర్లు శశిధర్ గొరిపర్తి, అర్చనామాధురి నిర్వహించారు. వందలాది మంది రోగులు కిడ్నీ, చర్మవ్యాధులతో పాటు సాధారణ, దీర్ఘకాలిక రోగాలకు సంబంధించిన వైద్యసేవలు ఉచితంగా పొందారు. ఈ సందర్భంగా డాక్టర్లు శశిధర్, అర్చనా మాధురి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా కిడ్నీ, చర్మవ్యాధులకు ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు మందుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా ప్రాథమిక స్థాయిలోనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యం పొందాలన్నారు. చర్మవ్యాధుల్లో సాధారణంగా ముఖం, మెడ, ఛాతీ, వీపుపై చర్మంపై బ్లాక్‌హెడ్స్, మొటిమలు వస్తుంటాయన్నారు. వీటిని అతి సులభంగా తగ్గించేలా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎగ్జిమా, లాటెక్స్ అలర్జీ, తట్టు, అమ్మోరు, రింగ్‌వార్మ్, మెలస్మా, బేసల్ సెల్ కార్సినోమా, పొలుసుల కణ కేన్సర్, ఇంపెటిగో, గజ్జి, హైపర్ హైడ్రోసిస్, సెల్యులైటిస్ వంటి మరికొన్ని చర్మ సంబంధిత వ్యాధులకు కూడా అధునాతనమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ అర్చనా మాధురి వివరించారు.

'స్పేస్ ఆన్ వీల్స్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ

అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికతపై విదార్థులు, యువతలో ఉత్సుకతను పెంపొందించేందుకు ఆధునిక అంతరిక్ష పరిజ్ఞానంపై సానుకూల దక్పథాన్ని కల్పించేందుకు స్పేస్ ఆన్ వీల్స్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్పేస్ ఆన్ వీల్స్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ విజయవంతంగా ముందుకు సాగుతోందని.. నగర విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా ఆదివారం, సోమవారం రెండురోజుల పాటు ఈ ప్రదర్శనను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. భారతదేశ తొలి ఉపగ్రహ వాహక నౌక నుంచి తాజాగా ఇస్రో ప్రయోగాల వరకు, లాంచ్వ్యాడ్లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తదితర విషయాలపై పరిజ్ఞానాన్ని పెంచేలా ప్రదర్శనలు ఉన్నాయన్నారు. వివిధ నమూనాలను

చూడటం, వాటి విషయాలను తెలుసుకోవడం ద్వారా అంతరిక్ష విజ్ఞాన వికాసానికి వీలవుతుందన్నారు. సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను వివరించడంతో పాటు అంతరిక్ష రంగంపై విద్యార్థులకు ఆసక్తిని కలిగించేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో షార్ టెక్నికల్ అధికారి కిరణ్ పాల్గొన్నారు. స్పేస్ ఆన్ వీల్స్ సందర్శనకు వస్తున్న విద్యార్థులకు కిరణ్.. భారత అంతరిక్ష విజయయాత్ర గురించి క్షుణ్ణంగా వివరిస్తున్నారు.

గ్రామాల్లో కుక్కల బెడద

ప్రజాశక్తి-వీరులపాడు

మండలంలో కుక్కల బెడదతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్లపై కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. గ్రామాల్లో ఏ వీధివైపు వెళ్లాలన్నా కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ గ్రామంలో చూసినా కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. రహదారులపై వెళుతున్న బాటసారులపై, ద్విచక్ర వాహనాలపై దాడి చేస్తున్నాయి. రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. జుజ్జూరు మండల కేంద్రంలో పాటు అల్లూరు, పెద్దాపురం, జగన్నాధపురం, జయంతి, ఎల్లంకి, పొన్నవరం, బోడవాడ, జమ్మవరం గ్రామాల్లో అయితే కుక్కల బెడద మరీ ఎక్కువగా ఉంది. ఏ గ్రామంలో అయినా 50 నుండి 100 వరకు కుక్కలు రోడ్లపై సంచరిస్తున్నాయి. కుక్కల బెడదతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, ద్విచక్ర వాహనాలు భయపడుతున్నారు. రాత్రివేళల్లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తులను వీధి కుక్కలు దాడి చేసేందుకు వెంబడిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.కుక్కలను నివారించడానికి అధికారులు ఇటువంటి చర్యలు తీసుకోవట్లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధి కుక్కలు దాడి జరిగినప్పుడు అధికారులు

నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ గ్రామపంచాయతీ అధికారులు కుక్కల పట్టివేతకు చర్యలు తీసుకోవట్లేదు. అప్పుడప్పుడు కుక్కల్ని పట్టివేస్తే వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించకుండా ఇతర గ్రామాల్లో వదిలేస్తున్నారు. ఇలా వదిలేయడం వల్ల గ్రామాల్లో కుక్కల బెడద పెద్ద సంఖ్యలో పెరిగింది. కుక్క కాటుకు ప్రజలు గురవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి మాట్లాడుతూ కుక్కల నియంత్రణకు గ్రామపంచాయతీకి సరిపడా ఆదాయం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

CHANGE OF SURNAME&NAME

I, MAMTA,W/o Kishore Purohit, R/o D. No.11-6-23, Geetha Mandir Road, One Town, Vijayawada NTR District, Andhra Pradesh - 520001, I have changed my name and surname MAMTA to MAMTA KANWAR RAJ PUROHIT W/o Kishore Purohit hereafter Myname is known as MAMTA KANWAR RAJ PUROHIT W/o Kishore Purohit

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మధిర బ్రాంచి వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని గుడేటి చక్రవర్తి తండ్రి:గుడేటి పిచ్చారావు,వయస్సు: 39సంll, నివాసం:మక్కపేట గ్రామం, వత్సవాయి మండలం, యన్.టి.ఆర్ జిల్లా వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంత రములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలుఆస్థి: యన్.టి.ఆర్ జిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా వత్సవాయి మండల, మక్కపేట గ్రామం పంచాయితీ లిమిట్స్‌లో చేరిన మక్కపేట గ్రామంలోని ఆర్ఎస్ నెం.142/1, రు దాఖలా య.0. 03సెంట్ల 966 లేక చుllగll 192లు నివేశన స్థలం, ఇందులో నిరిృంచబడిన డోర్ నెం.3-187రు, **డాక్యుమెంట్‌నెం.3981/2025,** అసెస్‌మెంట్ నెం.587రు గా గల ఆర్‌సిసి డాబా మరియు రేకుల కప్పు గల ఇల్లు, కలప, కప్పు, తలుపులు, దర్వాజలు, ఇందులో గల కరెంట్ మీటరు నెం.6333316001546, కరెంటు ఫిటింగ్స్‌తో సహా గల స్థిరాస్థినకు హద్దులు:**తూర్పు**:నూకపొంగు ప్రసాదరావు యంద్రాతి నాగేశ్వరరావు గార్ల ఇళ్ళు, **దక్షిణము**: సిసి రోడ్డు,**పడమర**: గుడేటి బాబు, గుడేటి దేవదాసు గార్ల ఇళ్ళు, **ఉత్తరం:** దేగల నారాయణ రావు గారి ఇల్లు

రాయపూడి శ్రీనివాసరావు

అడ్వకేట్, నోటరీ, జగ్గయ్యపేట.

మూఢ నమ్మకాలను పార ద్రోలాలి

- జెవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : విద్యార్థి దశలో చక్కగా చదువుకొని విజ్ఞానాన్ని సంపాదించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, మంచి తెలివితేటలు వస్తాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ లెనిన్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో కూడా తల్లిదం డ్రులు తమ పిల్లలను మూఢనమ్మకాల వైపు ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ గురువుల ద్వారా తెలుసుకున్న జ్ఞానాన్ని తల్లిదండ్రు లతో పంచుకొని వారిలో ఉన్న మూఢనమ్మకాలను పారద్రోలాలన్నారు. చిన్న వయసులో పిల్లలకు సంక్ర మించే కొన్ని కొన్ని వ్యాధులు పట్ల కూడా తల్లిదండ్రులు అనుసరిస్తున్న మూస పద్ధతుల నాటు వైద్యం, మంత్రాలు, వేపాకులతో పని జరగదని, ఒక్కోసారి ప్రాణాపాయ పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో ప్రతి ఒక్కరు విజ్ఞానం వివేకం వివేచనతో ఏది మంచి, ఏది చెడు అని తర్కించి నిర్ధారణకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌టి స్టేట్ అసెస్మెంట్ మెంబర్ సజన్, ఎస్‌ఆర్‌టి నోడల్ ఆఫీసర్ సురేష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ శోభన్ కుమార్, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. రామకృష్ణ విద్యా సంస్థల సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంలో సహకరించారు.

విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 24వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామనిజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగు తుందని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. అలాగే మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకో వడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల పరిధిలోని వడ్లమన్నడు, వేమవరం పులవలపూడి, రెడ్డిపాలెం, భీమునిగుంట, గాదేపూడి గ్రామాలలో సోమవారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఇఇ జిబి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు డోకిపర్రు, లంకాదొడ్డి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.కావున విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

నేడు ఉచితంగా బిఎండి పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి : 50 సంవత్సరాలు దాటిన వారిలో వచ్చే అస్టియో పోరోసిస్(ఎముకల బలహీనత) వ్యాధిని గుర్తించేందుకు బోన్ మినరల్స్ డెన్సిటీ(బిఎండి) పరీక్షలు సోమవారం చల్లపల్లి చంద్రరాజేశ్వరరావు వికాస్ కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సిఆర్ ట్రస్ట్ ప్రతినిధి అడ్డాడ ప్రసాద్ బాబు తెలిపారు. ఫోర్డ్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాపారావును సన్మానిస్తున్న దృశ్యం

చిలకలపూడి పాపారావుకు సన్మానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావును అగ్నికుల క్షత్రియ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిం చారు. ఆదివారం అవనిగడ్డలోని చైర్మన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ ఎంప్లాయిస్ పాపారావును శాలువాలు, గజమాలతో సత్కరించారు.

రాఘవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో జంపాన రాఘవయ్య ప్రథమ వర్ధంతి ఆదివారం జరిగింది. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ పాల్గొని రాఘవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవయ్య కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో శ్రమించారని, వారి మార్గంలోనే పయనిస్తూ కల్లుగీత కార్మిక కుటుంబాలకు అండగా ఉంటూ వారికి ప్రభుత్వం ద్వారా సహాయం అందేటట్లు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నే ధనయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు రాధాకష్ణ, టిఎన్‌టియుసి కృష్ణాజిల్లా అధ్యక్షులు కొండవీటి శివయ్య, పామర్తి కిషోర్, పడవల మధుసూదన్, అన్నే సురేంద్ర బొర్రా వెంకట్, జంపాన వీరస్వామి పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ 18,69,564 లు ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే బుద్ద ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

కొండలమ్మ దేవస్థానంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించు కున్నారు. అమ్మవారిని సుమారు పదివేల మంది యాత్రి కులు దర్శించుకోగా అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మ వారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కు బడులు తీర్చుకున్నారు. యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు, దేవస్థాన కార్య నిర్వహ ణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఫ్లెక్సీ తొలగిస్తూ నలుగురికి విద్యుత్ షాక్

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-ఉయ్యూరు : అయ్యప్పస్వామి దీక్ష పరులు పడిపూజ సందర్భంగా రోడ్డుపక్కన కట్టిన ఫ్లెక్సీ నలుగురి ప్రాణాలమీదకు తెచ్చింది. బిల్డింగ్ పక్కన కట్టిన ఫ్లెక్సీ తీస్తుండగా విద్యుత్ వైర్లకు తాకి నలుగురు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం శివాలయం సెంటర్లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం స్థానిక సుందరమ్మ పేటకు చెందిన యువకులు శివాలయం ఎదురుగా మేదర బజార్ వైపు కట్టిన ఫ్లెక్సీ ఊడిపోసేందు కు పక్కన ఉన్న భవనంపైకి గొరిపర్తి సురేంద్ర, మేకల శివసాయి, జొన్నలగడ్డ పద్మ నాథ్, జొన్నలగడ్డ రాము ఎక్కారు. ఫ్లెక్సీ తీస్తున్న క్రమంలో జారి పక్కన ఉన్న విద్యుత్ వైర్లకు ఫ్లెక్సీ అల్యూమి నియం ఫ్రేమ్ తాకింది. దీంతో విద్యుత్‌కు గురై తీగలకు వేలాడుతుండగా మరోఇద్దరు భవనంపై పడిపోయారు. సంఘటన చూసి సమీపంలో ఉన్నవారు కర్రలతో వైర్ల ను కొట్టి విడిపించారు. ఈప్రమాదంలో వీరికి మొఖం, చేతులు, కాళ్ళు కాలి తీవ్రంగా గాయపడగా ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్పందించిన వైద్యశాల చైర్మన్ జయదేవ్ హుటాహుటిన తరలివచ్చి దగ్గరుండి వైద్యులతో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజ యవాడ ప్రభుత్వ వైద్యశాల కు తరలించి. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో సురేంద్ర శరీరం కాలిన తీవ్రంగా గాయపడగా పరిస్థితి విషమంగా ఉన్న ట్లు సమాచారం.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున గగన్ ట్రావెల్స్ బస్సుకు ప్రమాదం తప్పింది. డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరిం చడంతో ప్రయాణికులు సురక్షి తంగా బయట పడ్డారు. గగన్ ట్రావెల్స్ కు చెందిన ఎఆర్ 20 ఇ 3344 నెంబర్ గల బస్సు హైదరా బాదు నుంచి అమలాపురం వెళుతోంది. ఈ క్రమంలో మండలంలోని చినఫుటపల్లి మిత్ర హోటల్ ఎదురుగా ఉన్న రోడ్ క్రాసింగ్ దగ్గర ఓ లారీ యూటర్న్ తీసుకుంటుండగా లారీని తప్పించే క్రమంలో లారీకి బస్సు కుడివైపున తగిలడంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరి ంచడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయట పడ్డారు.

రత్నగిరిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి- మోపిదేవి : తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సభ్యులు, ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రావి రత్నగిరిని తెలుగుదేశం పార్టీ నేతలు పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మోపిదేవిలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రత్నగిరిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గం టిడిపి పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ టిడిపి నేతలు బొబ్బా గోవర్ధన్, మేడికొండ విజయ్, కోట సాయి, పరుచూరి దుర్గాప్రసాద్ లు పరామర్శించారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో గిరిజన ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి నేటికీ 78 సంవత్సరాలు కావస్తున్న కూడు గూడు లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారని అన్నారు. అంతేకా కుండా గిరిజనుల అభివృద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించ కుండా వినియోగించాలంటే చట్టసభలలో గిరిజనుల తరఫున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనలను తీసుకోరాదని బాధాకరంగా ఉందన్నారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం, జాతి వెలుగు కోసం, ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర ప్రతి గిరిజన ప్రాంతా నికి చేరేలా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య కృష్ణాజిల్లా అధ్యక్షుడు భూక్యా షమీర్ నాయక్, జిపిఎస్ యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, యాకసిరి వెంకటేశ్వరావు మద్దిల పండు రంగారావు ,శీలం మురళి కష్ణ ,శీలం సత్యం పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ఎపి బ్యాక్వర్డ్ క్లాస్ ఫెడరేషన్ అధ్యక్షులు తమ్మిశెట్టి చక్రవర్తి ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి గుంటూరు పార్లమెంట్ అబ్జర్వర్ పోతిన వెంకట మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఐదు కోట్ల మంది ప్రజల వైద్యం కోసం వైద్య విద్యకు మూడు వేల కోట్ల రూపాయలు కూడా కేటాయించలేకపోతున్నారన్నారు. పిపిపి విధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో వచ్చే నెలలో చేపట్టబోయే ప్రజా ఉద్యమంతో కూటమి ప్రభుత్వ పునాదులు కదులుతాయని హెచ్చరించారు. ఎపి బ్యాక్వర్డ్ క్లాస్ ఫెడరేషన్ అధ్యక్షులు తమ్మిశెట్టి చక్రవర్తి మాట్లాడుతూ పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను రద్దు చేయకపోతే రాష్ట్రంలో బిసిలందరిని కలుపుకొని ఉద్యమిస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ మాల మహానాడు అధ్యక్షులు వడ్లాని శ్యామ్, పైడిపాటి మురళి, రమేష్, పైడిపాటి దుర్గారావు, దేవర సురేష్, పోతిన రాము, గంగాధర్, అడ్డూరి తమ్మారావు, మొలకల హనుమాన్, నూనె సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : లివర్ సంబంధిత వ్యాధితో విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త బండి వెంకటరమణను 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వేంకటేశ్వరరావు (చంటి) పరామర్శించారు. ఆదివారం ఆయన చికిత్స పొందుతున్న హాస్పిటల్‌కి వెళ్ళి బండి వెంకటరమణను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందించాలని కోరారు. అదేవిధంగా రమణ ఆనారోగ్య పరిస్థితులను పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్ళి వైద్య చికిత్స పొందేందుకు తగు కృషి చేస్తామని వెంకట రమణకు భరోసా ఇచ్చారు.

ఘనంగా బొమ్మసాని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి– విజయవాడ సిటీ : టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.. గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో టీడీపీ సీనియర్ నేత కోగంటి రామారావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, జనసేన నాయకులు బొల్లేపల్లి కోటేశ్వరరావు, వేంపలి గౌరీ శంకర్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతలు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి జన్మదినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

- వామపక్ష, ప్రజాసంఘాల నేతలు డిమాండ్

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి

ప్రజాశక్తి-విజయవాడ : ప్రస్తుతం జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను కోర్టులో హాజరు పరచాల, బహుళజాతి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో బూటకపు ఎదురు కాల్పులను వ్యతిరేకిస్తూ, న్యాయ విచారణ జరపాలని కోరుతూ నిరసన సభ నిర్వహించారు. సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, న్యూ డెమోక్రసీ నేత చిట్టిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ ... మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్‌లకు అటవీ సంపదను అప్పనంగా దోచిపెట్టేందుకే మావోయిస్టుల ఏరివేత చేపట్టారని విమర్శించారు. ఎస్‌కెఎం ఎపి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అపారమైన ఖనిజ సంపద ఉన్న అడవులను అదానీ, అంబానీలకు అప్పగించే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం ఆరేషన్ కగార్ చేపట్టిందని విమర్శించారు. గిరిజనులకు అండగా ఉంటున్న మావోయిస్టులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపి పొట్టన పెట్టుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్ష భావజాలం ఉన్నవారిని హతమార్చటం దుర్మార్గం అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి మాట్లాడుతూ గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో హింసను కొనసాగించి అధికారం దక్కించుకున్న నరేంద్ర మోడీకి తగిన గుణపాఠం చెప్పాలంటే ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పేర్కొన్నారు. అడవుల్లోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ వర్గానికి దోచిపెట్టడానికి, అడవుల నుంచి గిరిజనులను తరిమేసే పనికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూనుకుందన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జెవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఎదురుకాల్పుల పేరుతో మావోయిజాన్ని అంతం చేయాలనుకోవడం పాలకుల భ్రమ అని అన్నారు. సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడలో పట్టపగలు సజీవంగా నిర్బంధించి, సాంకేతికంగా అడవుల్లో కాల్చిచంపినా సారాంశంలో మాత్రం విజయవాడలోనే ఎన్కౌంటర్లు జరిగినట్లు భావించాలని అన్నారు. మోడీ ప్రభుత్వ కగార్ ఆపరేషన్‌కి మద్దతుతో ఆగకుండా ఆపరేషన్ సంభవ్ నిర్వహణలో భాగస్వామిగా కూడా చంద్రబాబు ప్రభుత్వం మారిందన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు కూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, పౌర హక్కుల సంఘం నాయకులు చిలుకా చంద్ర శేఖర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి.హరినాథ్ , ఎంసిపిఐ, ఎస్‌యుసిఐ, ఆర్ఎస్పి, రెడ్ ఫ్లాగ్ నేతలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి – ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ లా ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఎ.కె.రవి కృష్ణ అన్నారు. నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో రెండవ రోజు అంతర్జాతీయ పోటీలను వారు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే క్రీడలలో ప్రావీణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆటలో నైపుణ్యత ఉంటే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని తెలిపారు. విజయవాడ నగరంలో అంతర్జాతీయ స్థాయిలో చెస్ పోటీలు జరగడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా రెండవ రోజు పోటీలలో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముకులు కె.ఆర్.ఎస్.రావు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైసర్ కె. వి.శర్మ పలుకుతూ నగర ప్రముకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజయవంతంగా సైన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 18 నుండి 23వ తేదీ వరకు భోపాల్‌లో జరిగిన 52వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శన (నేషనల్ సైన్స్ ఫెయిర్)లో జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ విద్యార్థులు యమ్.నాగతేజ, వై. భార్గవ్ ధనుష్‌లు తయారు చేసిన ప్రొటెక్టింగ్ వెహికల్స్ అండ్ బ్రిడ్జిస్ ఫ్రామ్ ఫ్లోడ్స్ (వరద ప్రవహాల నుండి వాహనాలను, వంతెనలను కాపాడే వ్యవస్థ) సైన్స్ ప్రాజెక్ట్ విజయవంతగా ప్రదర్శించారు. గైడ్ టీచర్ గార్లపాటి చంద్రశేఖర్ అధ్వర్యంలో ఈ ప్రాజెక్టును విజయవంతంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

టయోటా మ్యూజియం ప్రారంభం

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ : టయోటా కిర్లోస్కర్ మోటార్ టెమ్ (టయోటా ఎక్స్‌పీరియన్షియల్ మ్యూజియం)ను ప్రారంభించిందని సంస్థ ప్రతినిధి కె.రాకేష్ బాబు తెలిపారు. నగర్లోని టయోటా షో రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. బెంగళూరులోని ఫీనిక్స్ మాల్ ఆఫ్ ఏషియాలోని టెమ్, మొబిలిటీ, ఇన్నొవేషన్ వాహనాలను మించి జీవన విధానంలోనూ ప్రభావం చూపుతాయని తెలిపారు. మాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 8,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపొందించిన టెమ్, ఐదు ఇంద్రియాలను ఉత్తేజపరిచే ప్రత్యేక అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు, ఆకర్షణీయ దృశ్యాలు, ప్రశాంతమైన శబ్దాలు, సొగసైన సువాసనలు, ఆహ్లాదకరమైన స్పర్శానుభూతులు మరియు జపనీస్ మినిమలిజాన్ని భారతీయ వెచ్చదనంతో మేళవించే రుచులు ఇక్కడ ఉంటాయన్నారు..

వ్యాసరచనలో 'నాగర్జున' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జగ్గయ్యపేట సత్యసాయి సేవా సమితి వారు స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాగార్జున హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని పి అర్థర స్కూల్ లెవెల్‌లో మొదటి బహుమతి, జగ్గయ్యపేట టౌన్ మొదటి బహుమతి, అలాగే 9వ తరగతి విద్యార్థిని టి ప్రణతి స్కూల్ లెవెల్‌లో 2వ బహుమతి సాధించి నిర్వాహకుల నుంచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్ సిహెచ్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికుల హక్కులు హరిస్తోన్న కేంద్ర ప్రభుత్వం : సిఐటియు

- లేబర్ కోడ్ జిఒ కాపీలు దహనం

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని సిఐటియు గన్నవరం మండల కన్వీనర్ బెజవాడ తాతబ్బాయి అన్నారు. గన్నవరం మండల కేంద్రంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సిఐటియు గన్నవరం మండల కమిటీ ఆద్వర్యం లో లేబర్ కోడ్ ల నోటిఫికేషన్ కాపీలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాతబ్బాయి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఈ కోడ్‌ల వల్ల కార్మికుల సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని, ప్రభుత్వం నోటిఫై చేసిన లేబర్ కోడులు ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనలను ప్రారంభం నుంచి సిఐటియు వ్యతిరేకించాయని అయినా కేంద్రం మొండిగా ముందుకు వెళ్లి 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక సంఘాల విజ్ఞప్తులను, నిరసనలను, సమ్మెలను పట్టించుకోకుండా కేంద్రం బడ్జెట్ సమావేశాలకు ముందు తమకు అనుకూలమైన వారితో సమావేశమై లేబర్ కోడ్‌లను యజమానులకు అనుకూలంగా, కార్మికులకు ప్రతికూలంగా మార్చారని విమర్శించారు. ఇది తిరోగమన చర్య అని కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్ లను ఖండిస్తున్నామని అన్నారు. రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు మాట్లాడి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బజార్ ముఠా, గ్రామ పంచాయతీ, బిల్డింగ్, హాకర్స్ యూనియన్ నాయకులు పఠాన్ సర్దార్, ఎం నాగేశ్వరావు, శ్రీనివాసరావు,గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాతాబ్బాయి

మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

26న దేశవ్యాప్త నిరసనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను నోటిఫై చేసి కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ ప్రయోజనాలకు సిద్ధమైన తరుణంలో కార్మికుల ఐక్యతను చాటి చెప్పేలా ఈ నెల 26 తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త నిరసనను మచిలీ పట్నంలో విజయవంతం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం బుట్టాయి పేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో పాత్రికేయులు సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మె విజయవంతం చేయడానికి అన్ని ప్రజా సంఘాలు మద్దతుగా మద్దతు ఇవ్వడమే గాక సమ్మెను పూర్తిస్థాయిలో విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని పేర్కొన్నారు. లేబర్ కోడ్ లను అమలు చేస్తున్న కేంద్రం ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకునే వరకు పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూర సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం మండల కార్యదర్శి చిరువోలు జయరావు, ఏఐటీయూసీ నాయకులు లింగం ఫిలిప్, ఐఎన్టీయూసీ నాయకులు జాఫర్ హుస్సేన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కొడాలి శర్మ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చీకటి రాజేశ్వరరావు, మండల కార్యదర్శి బెనర్జీ, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎండి యూనస్ తదితరులు పాల్గొన్నారు.

సీతాయలంకలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ శివారు సీతాయలంక గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీతాయ లంకకు చెందిన మేడి కొండ సుబ్రహ్మ ణ్యం సుభాషిని దంప తుల కుమార్తె మేడికొండ శ్రావ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనరల్ సర్జన్ డాక్టర్ ఎం శ్రావణ్ కుమార్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేశ్వరరావు, డెంటల్ వైద్యులు డాక్టర్ శైలజ, ఇఎన్టి స్పెషలిస్ట్ డాక్టర్ సమీరా, అనిస్తీషియా డాక్టర్లు కిరణ్, డాక్టర్ సంగీతరావు, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ జిష్ణు మెహర్, డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ శ్రావణి, తదితరులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీతాయలంకకు చెందిన బుస్సా కోటేశ్వరరావు, తెనాలి. భగవంతు రావు (బాబుజి), నాదెళ్ల వెంకటరాజు (జేమ్స్) పాల్గొని వైద్య శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దోకిపర్రు ఆలయం కిటకిట

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : దోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థిక సాయంతో జరిగింది. ఈ సంధ్భంగా స్వామివార్ల ఉత్సవ మూర్తులకు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వ ర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

బొండాడ ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : బొండాడ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అందజేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఆవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అభినందించారు. ఆదివారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో బొండాడ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రముఖ పారిశ్రామి కవేత్త బొండాడ రాఘవేంద్రరావు ఆర్థిక సహకారంతో రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వార్షిక స్కాలర్షిప్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ సంస్థ ప్రోత్సాహం సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. సంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికీ విద్యార్థులకు సహాయంకు కోటి రూపాయలు సహాయం చేయడం, మరో 30 లక్షల రూపాయల సహాయం లక్ష్యం గా కార్యక్రమాలు నిర్వహిం చటం అభినంద నీయమన్నారు. విద్య, క్రమశిక్షణ, అంకిత భావం నిబద్ధతలతో జీవితంలో సామాన్య స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకొని ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్న రాఘవేంద్ర రావును స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సేవా మూర్తిగా సామాజిక సేవ చేసేందుకు ముందుకు వచ్చి బొండాడ ఫౌండేషన్ ద్వారా కార్యక్రమాలు చేపట్టిన రాఘవేంద్రరావు సతీమణి బొండాడ నీలిమ అభినందనీయులు అన్నారు. ఈ సందర్భంగా బొండాడ ఫౌండేషన్ చైర్ పర్సన్ బొండాడ నీలిమ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా నియోజకవర్గంలోని 82 మంది కళాశాల విద్యార్థులకు రూ ఆరు లక్షల స్కాలర్షిప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలోరాయల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ సీతాలం రాంబాబు, కార్యదర్శి తోట. పద్మనాభరావు, కోశాధికారి అంకం. రామ సాయి ప్రసాద్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓ సూరి. బాల బాలాజీ, నియోజకవర్గ యువ నాయకులు మండలి. వెంకట్ రామ్, బొండాడ రాఘవేంద్ర తనయుడు జితిన్ చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు బొండాడ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ వంగర శేషగిరి రూ 25 వేల విలువ కలిగిన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్న దృశ్యం

ఎన్‌సిసితో క్రమశిక్షణ, దేశభక్తి

ప్రజాశక్తి-ఉయ్యూరు : నిర్మాణాత్మక శిక్షణ, కార్యకలాపాల ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణం, దేశభక్తి పెంపొందించేందుకు ఎన్సీసీ ఎంతగానో దోహద పడుతుందని సుధీర్ంబర్ డిపో అధినేత, ఆర్యవైశ్య సంఘ ప్రముఖుడు డాక్టర్ నూకల వెంకటసాంబశివరావు అన్నారు. ఎన్సీసీ స్థాపన దినోత్సవం పురస్కరించుకుని ఏజీఅంర్ఎస్ఎస్ కళాశాలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఎన్సీసీ స్థాపన, విజయాలను గుర్తుచేస్తూ ఎన్సీసీ డే దేశం లో ప్రతి సంవత్సరం నవంబరు నెల నాల్గవ ఆదివారం జరుపుకుంటారన్నారు. శిక్షణలో ఉత్తీర్ణులైన క్యాడెట్లకు ఉద్యోగనియామకాల్లో రిజర్వేషన్ ఉంటుందని, క్రమ శిక్షణ, జాతీ యత ఏర్పడుతుందన్నారు. ఈసందర్భంగా వృద్ధులకు 50 దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కళా శాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, ఎన్సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్ పాల్గొని ఎన్సీసీ ప్రత్యేకత వివరించారు.

సమావేశములో మాట్లాడుతున్న నూకల సాంబశివరావు

దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

అవనిగడ్డలో...

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిధిలోని పలువురు మృతుల కుటుంబాలను ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు పరామర్శించారు. ఆదివారం అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తపేటకు చెందిన భూపతి అంకమ్మ ఇటీవల మృతి చెందారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న శ్రీనివాస్ కొత్తపేటలోని వారి స్వగహానికి వెళ్లి మృతురాలి కుమారుడు ఉదయ భాస్కర్‌ను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, న్యాయవాది విక్కుర్తి రామకష్ణ, పులిగడ్డ. చంద్ర, బర్మా శ్రీనివాసరావు, బర్మా బుజ్జి, భూపతి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండల పరిధిలోని పెదప్రోలు గ్రామానికి చెందిన గడ్డం వెంకటస్వామి కుమారుడు కోటేశ్వరరావు(గోవా కోటేశ్వరరావు) ఇటీవల మృతి చెందగా కోటేశ్వరరావు గృహానికి విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పెదప్రోలు పంచాయతీ సర్పంచ్ పోలిమెట్ల యేసుబాబు, పిఎసిఎస్ చైర్మన్ నాదెళ్ల శరత్ చంద్ర బాబు, విక్కుర్తి రాంబాబు, పెదప్రోలు పంచాయతీ పాలకవర్గ సభ్యులు కొల్లూరి అప్పారావు పాల్గొన్నారు.

మోపిదేవిలో...

క్రీడలతో పనిఒత్తిడి దూరం : నెట్టెం రఘురాం

ప్రజాశక్తి - గుడివాడ : పనిఒత్తిడి నుంచి క్రీడలు ఎంతో ఉత్సాహం ఇస్తాయని కెడిసిసి బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రాఘురామ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో గుడివాడ డివిజన్‌స్థాయి డిసిపిసి బ్యాంక్ పరిధి లోని 11 బ్యాంక్‌లలోని 103 సొసైటి ఉద్యోగస్తులకు ఈనెల 21,22,23 తేదీలలో క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ క్రీడా పోటీలను గుడివాడ డిసిపిసి ఎజిఎం మాటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి నెట్టెం రాఘురామ్ పాల్గొని క్రీడలో పాల్గొని విజేతలుగా నిలిచిన ఉద్యోగస్తులను బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడితో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ఇలాంటి క్రీడలు ఒత్తిడి తగ్గిస్తాయన్నారు. జిల్లా స్థాయిలో కాకుండా రాష్ట్రస్థాయిలో ఉద్యోగస్తులకు క్రీడలు నిర్వహించేల చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, డా॥ గోర్జి సత్యనారాయణ, మాజీ ఐఎఫ్ఎస్ కాకొల్లు భస్మాకరరావు, బ్యాంక్ సిఇఓ శ్యామ్, జిఎం చంద్రశేఖర్, బ్యాంక్ డిజిఎం ప్రభాకర్, గుడివాడ బజార్ బ్రాంచ్ మేనేజర్ ఎం.సాంబశివరావు, బ్యాంక్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

రహదారి బురదమయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో పిఎసిఎస్ రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బురద తో కూడిన మురుగునీరు రోడు పైకి వచ్చి ప్రజల రాకపోకలకు, స్థానికులకు ఇబ్బందిగా ఉంది. గత కొంత కాలంగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-చందర్లపాడు: అభివద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశించారు. చింతలపాడు గ్రామంలో ఆదివారం ఆమె పర్యటించారు. తోటరావుల పాడు -ఏటూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్డు సౌకర్యం ఎంతో కీలకమని, ప్రజలకు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పనులు నిర్దేశిత గడువులోగా నాణ్యతలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉన్న నరసింహారావు, చింతలపాడు సొసైటీ అధ్యక్షులు బొందలపాటి రామలింగేశ్వరరావు, కూటమి నేతలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి-వత్సవాయి

మండలంలోని మంగోల్లు గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని నేలవల్లి కోటేశ్వరరావు (72) వయోభారంతో బాధ పడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కడదాకా పార్టీ పట్ల అంకితభావంతో ఉండే వారని పలువురు నేతలు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ సభ్యులు దేవినేని లక్ష్మీనారాయణ, కనకపుడి పటేల్.. తదితరులు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. కోటేశ్వరరావు భౌతికకాయంపై పార్టీ జెండాను ఉంచి జోహార్లు అర్పించారు.

రోడ్డు తవ్వి.. వదిలేశారు

ప్రజాశక్తి-వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలోని పిఎన్ఆర్ కాంప్లెక్స్ ఎదురుగా ఈ ఏడాది కురిసిన వర్షాలకు వరదలు ఉధృతంగా రావడంతో రోడ్డుపైకి పెద్ద ఎత్తున నీరు చేరింది. నీటిని బయటకు పంపేందుకు కార్తీక్ ఎరువుల దుకాణం వద్ద గ్రామపంచాయతీ అధికారులు జెసిపిలతో గాడి కొట్టి ఆ మట్టిని బయటికి తరలించారు. అడ్డుగా ఉన్న పైపులను పగలగొట్టారు. అనంతరం రోడ్డును సరిచేయకుండా అలాగే వదిలేశారు. చిల్లకల్లు వైరా రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తవ్వి వదిలేసిన మట్టి రోడ్డుపైన ఉండడంతో ఎదురు ఎదురుగా వచ్చే వాహనాలు తొలగటానికి మార్జిన్ లేక వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు గోతిలో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి స్ఫూర్తితో యువత సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : శ్రీ సత్యసాయిబాబా అందించిన స్ఫూర్తి.. తరతరాలకు సేవా దీప్తి అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఆదివారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, వివిధ శాఖల అధికారులు, శ్రీ సత్యసాయి సేవా సమితుల సభ్యులు సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలోని సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి శ్రీ సత్యసాయి గొప్ప ఆలోచనలు చేసి అందరికీ ఆదర్శవంతంగా నిలిచారన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో యువత ముందడుగు వేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని నివాళులర్పించారు. ఈ

కార్యక్రమంలో కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. విఎంసిలో జరిగిన సత్యసాయి జయంతి వేడుకల్లో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ (జనరల్) ఏ. రవీంద్రరావు తదితరులు పాల్గొన్నా సత్య సాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, వియంసి సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-వత్సవాయి : మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ తెలిపారు. పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లు త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారితో పాటు 8 బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు దిశక్ర వాహనాలు ఇస్తే వారితోపాటు వారి తల్లిదండ్రులు కూడా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అనంతరం పట్టుకున్న వారందరికీ రోడ్డు నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ గిరి సాయి, సిబ్బంది పాల్గొన్నారు

25న తిరుపతమ్మ ఆలయ పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి-వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం ఈ నెల 25న ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఈవో కిషోర్ కుమార్ తెలిపారు. ఆలయ చైర్మన్ ఛాంబర్‌లో జరిగే ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనీమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జెడ్.నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సమైక్యత వంటి విలువలను పెంపొందించుకోవాలన్నారు. సమాజ సేవలో ప్రతి యువకుడు బాధ్యతతో ముందుకు రావాలని తెలిపారు. ఎన్‌సిసిలో చేరడం ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం,

సామాజిక బాధ్యత, సేవ భావం లాంటి లక్షణాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి డాక్టర్ జె.రాముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

26న చలో విజయవాడ : వైసిపి

ప్రజాశక్తి - తిరువూరు : విజయవాడ నడిబొడ్డున వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన అంబేద్కర్ స్మృతివనం కూటమి ప్రభుత్వంలో ఆదరణకు నోచుకోక విధ్వంసానికి గురవుతుందని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ అవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ దళిత విభాగానికి చెందిన నాయకుల సమావేశం జరిగింది. అంబేద్కర్ స్మృతివనంను కాపాడాలని ఈ నెల 26న చలో విజయవాడకు దళితులు తరలిరావాలని స్వామిదాస్ పిలుపునిచ్చారు. స్వరాజ్య మైదానంలోని అంబేద్కర్ స్మృతి వనాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. అంబేద్కర్ ను అవమానించే రీతిలో వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

నందిగామలో సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని కేక్ కట్ చేశారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నందిగామలో పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామ పరిధిలో రావికంపాడు పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పంట కాలువలో ఉన్న మృతదేహాన్ని రైతు నాగరాజు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మహిళ వయస్సు 25-30 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5.2 అడుగులు, కుడి చేతిపై "ప్రణయ్ " అనే టాటూ ఉందని తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని చిల్లకల్లు ఎస్ఐ టి సూర్య శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9440796465, 9440796461, 8332983809 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన సినీ మాటల రచయిత బొమ్మిన వెంకటరమణ తన శిరిడీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా రెడ్డిగూడెం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంస్థ కార్యాలయంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవితరణ చేయడం ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని తెలిపారు. దాతలు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కైతేపల్లి సాంబశివరావు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీకు అభినందనలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియామకమైన మొహమ్మద్ ఫారుక్ షుబ్లీకు సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఫారుక్ షుబ్లీను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అల్తాఫ్ బాబా మాట్లాడుతూ మైనార్టీ సమాజం సంక్షేమానికి ఫారుక్ షుబ్లీ ముస్లిం హక్కుల పోరాట సమితి అనే సంస్థను స్థాపించి ఎన్నో సేవలు అందించారు అన్నారు. ఆయనకు పదవి రావడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఉర్దూ భాషాభివృద్ధికి మరింత కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు షేక్ మహబూబ్ సుభాని, తబ్రేజ్, కుమార్, షేక్ బాషా, షేక్ అబ్దుల్ హఫీజ్ ఖాద్రి, పామర్తి రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

ప్రజాశక్తి-జి కొండూరు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన జి.కొండూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెవుటూరు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ గ్రామంలో తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి జి కొండూరు నుండి చెవుటూరు వచ్చే క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఒక దానికి ఒకటి ఢీ కొనడంతో హుస్సేన్‌తోపాటు బీహార్‌కు చెందిన యువకుడికి గాయాలయ్యాయి. విజయవాడ చత్తీస్‌ఘడ్ రహదారిపై జి కొండూరు నుండి చెవుటూరు వచ్చే మార్గంలో ఉన్న ప్రభు క్రషర్ మిల్లు వద్ద ఈ ప్రమాదం జరిగింది. జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బందరులో...

మొవ్వలో...

సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సత్యసాయి బాబా సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నగరంలో ఈడేపల్లిలోని సత్య సాయి సేవా మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి జిల్లా స్థాయి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ముఖ్య అతిథిలుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సత్య సాయిబాబా చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో లహరి, వర్షిత, జాహ్నవి, హరిణి తదితర చిన్నారులు తమ శ్రీఔత్య ప్రదర్శనలతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని, మంత్రముగ్ధులను చేశారు. సత్య సాయి సేవా సమితి కన్వీనర్ పి ఆంజనేయులు, ఇన్చార్జి డిఆర్ఓ, కేఆర్ఆర్సి ఎస్డిసి శ్రీదేవి, ఏఎస్పీ బి సత్య నారాయణ, యిఔష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కే రాంజీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి పాల్గొన్నారు.

ఎస్పి కార్యాలయంలో... : సత్యసాయి బాబా బోధనలు సమాజంలో శాంతి, సేవాభావం, మానవతా విలువలను పెంపొందించాయని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం శ్రీ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ నాయుడు, పోలీస్ అధికారులతో కలిసి సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

దివిసీమ ఆత్మబంధు సత్యసాయి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ ఆత్మబంధువు సత్యసాయి బాబా అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆదివారం అవరగడ్డ వంతెన సెంటర్లో పుట్టపర్తి సాయి బాబా శత జయంతి వేడుకలు, కీర్తిశేషులు మండల వెంకటకష్ణారావు శతజయంతి వేడుకలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటానికి బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు. కష్ణారావు విగ్రహానికి ఘంటసాల మండలం వేములపల్లి గ్రామం నుంచి తెలుగు యువత నాయకులు పాటిబండ్ల నరేష్, గ్రామ కార్యదర్శి మాతంగి సతీష్ పూలదండలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం ,సత్యసాయి సేవా ప్రతినిధులు రిషికేశ్వర్, సనక నాగ మునేశ్వరరావు, బావిశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ : అవనిగడ్డలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 40 మంది నిరుపేద ఎస్సీలకు టవళ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం అవనిగడ్డలోని ప్రగతి విద్యాసంస్థల ప్రాంగణంలో పుట్టపర్తి సాయిబాబా శత జయంతి వేడుకలు సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది గ్రామపంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాలు. 40 మంది ఎస్టీలకు టవల్సు, దుప్పట్లు మండలి వెంకట్ రామ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వంద మందికి అన్నదానం కూడా నిర్వహించారు. సేవా సమితి కార్య నిర్వాహకులు సనక. నాగ మునీందర్ రావు, బావి శెట్టి. లక్ష్మణరావు, అరవ రామ్మోహన్రావు, రఘువీర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయిబాబా శతవర్షజయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు, పేద వర్గాలకు వందమందికి దుప్పట్లను పంపిణీ చేసి 1500 మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మొవ్వ సత్యసాయి సేవా సమితి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమాలను కన్వీనర్ మండల వాసుదేవరావు (మున సబు) దంపతులు, ఇన్చార్జిదంపతులు వెంకటేశ్వరరావు దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించగా పొట్లూరు వెంకటేశ్వరరావు, సిహెచ్ లక్ష్మీనారాయణ, సిహెచ్ బి శివ తదితరులు పాల్గొని సహకరించారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అమెరికా ఆధిపత్య ధోరణిపై కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : అమెరికా ఆధిపత్య ధోరణి వ్యతిరేకించాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. మండలంలోని మర్లపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారత దేశంతో సహా అనేక దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అలాంటి ట్రంప్ నిర్ణయాలను ప్రతిఘటించవలసిన భారత ప్రభుత్వం ట్రంప్ అడుగులకు మడుగులు ఒత్తుతోందన్నారు. దీంతో భారత వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన విమర్శించారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లోని ఆక్వా, చేపలు లాంటి సముద్ర ఉత్పత్తులతో పాటు వ్యవసాయ రంగంపై ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థ నష్టం జరిగే ప్రమాదం ఉందని, ఇప్పటికే కొంత నష్టం సంభవించిందని ఆంజనేయులు అన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి, అమెరికా విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ఒత్తిడి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పార్టీ నాయకులు అనుమాన్ వెంకటేశ్వరరావు, సురగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరావు, బాబావాలి జాస్తి శ్రీనివాసరావు, పఠాన్ సర్ధార్, చల్లా సాంబశివరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మంగళగిరి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంగళగిరి ప్రధాన తపాలా కార్యాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాపాల శాఖ మంగళగిరి సబ్ డివిజన్ అధికారి ఆర్.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించటమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అని ఆయన అన్నారు. ర్యాలీ మంగళగిరి తపాలా శాఖ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ కుర్రా శ్రీనివాసరావు, భీమిడి రామకృష్ణ, తపాలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోతిలో ఇరుక్కుపోయిన ధాన్యం ట్రాక్టర్

పెదకళ్లేపల్లి రహదారి అధ్వానం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని వెంకటాపురం-పెదకళ్ళపల్లి మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు హడలెత్తి పోతున్నారు. మోపిదేవి నుండి పెదకళ్ళేపల్లి వరకు ఉన్న రహదారి గోతులపడి అధ్వానంగా తయారైంది. మోపిదేవి, రావివారిపాలెం, వెంకటాపురం, పెదకళ్ళపల్లి గ్రామాలకు ప్రయాణం చేయాలంటే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపురం వద్ద రహదారిపై పడిన గోతులలో శనివారం రాత్రి ధాన్యం ట్రాక్టర్ దిగబడింది. గంటలకొద్దీ ఇతర ట్రాక్టర్లతో లాగేందుకు ప్రయత్నించినా గోతుల నుండి బయటకు రాలేదు. ఈ మార్గంలో తాము రాలేంటూ ట్రాక్టర్ యాజమానులు చేతులెత్తేయడంతో ధాన్యం రవాణా ఎలా రవాణా చేయాలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారిని బాగుచేయాలని కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : వెనిగండ్ల



ధాన్యం పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఉదయం పర్యటించారు. పలుచోట్ల రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే రాము వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కవుతరం పరిసర ప్రాంతాల్లో రోడ్ల వెంబటి ఆరబోసిన ధాన్యపు రాశులు, కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ళలో ఆర్ ఎస్ కె నిర్ణయించిన తేమశాతం... రైస్ మిల్లర్లు చెబుతున్న తేమ శాతంలో వ్యత్యాసం ఉంటుందని పలువురు రైతులు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకు వచ్చారు. జె.సితో మాట్లాడిన ఎమ్మెల్యే రాము... మిల్లర్ల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్.ఎస్.కె కేంద్రాల వద్ద తేమ శాతం నిర్ధారణ పరీక్షను పరిశీలించిన ఎమ్మెల్యే రాము,పలువురు రైతులకు ధాన్యం విక్రయాలకు అవసరమయ్యే ట్రక్ షీట్ పత్రాలను ఎమ్మెల్యే రాము అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు న్యాయమైన మద్దతు ధర, సమయానికి కొనుగోలు, పారదర్శక వ్యవస్థ అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తితే నేరుగా తన దష్టికి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమ ంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్లల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరు రవికుమార్, తాసిల్దార్ బి.లోకరాజ్, వ్యవసాయ శాఖ ఎ.ఓ లోయ సునీల్, ఆర్ ఐ హనుమ, మండల కూటమి నాయకులు సాయన పుష్పావతి, వల్లభనేని బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం : సిఐటియు

ప్రజాశక్తి- తాడేపల్లి : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైకిరిని, ప్రజల్ని చైతన్యవంతం చేసి తిప్పికొడతామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయ రమాదేవి అన్నారు. సిఐటియు గుంటూరు జిల్లా 11 మహాసభ జిల్లా తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో ఆదివారం ప్రారంభమైంది. బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాస్, కె.రమణ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రజలందరికీ మేలు జరగాలంటే సోషలిజంలోనే సాధ్యమన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా వద్దతాకట్టు పెట్టారని విమర్శించారు. అదాని లాంటి పెట్టుబడిదారులకు సంపదనంతా దోచిపెట్టడమే మోడీ లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామనే హామీతో అధికారంలోకి వచ్చినవారు ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగం పెంచారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా పెట్టుబడిదారులకు అమ్మేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 4 లేబర్ కోడ్లను తెచ్చి, పోరాడి సాధించుకున్న 29 చట్టాలను ఎత్తివేసారని, 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానం తీసుకొచ్చారని, ఫ్యాక్టరీల్లో యూనియన్ పెట్టుకునే హక్కును కూడా కాలరాశారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా దీనికి మద్దతిస్తోందని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ,26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా సిఐటియు జెండాను వివికె సురేష్ ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద ప్రతినిధులందరూ నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. మహాసభ ప్రారంభ సందర్భంగా సిపిఎం మాజీ జాతీయ కార్యదర్శిసీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత మహాసభ నుండి ఎప్పటి దాకా మరణించిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, కె.ఉమామహేశ్వరరావు, నాయకులు వై.నేతాజీ, డి.లక్ష్మీనారాయణ, ఎన్.శివాజీ, వి.దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, డి.భాగ్యరాజు, వై.బర్నబాస్, డి.వి.భాస్కర్ రెడ్డి, బాలాజీ, కె.లక్ష్మి, రేణుక, శశిరాణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- తాడేపల్లి : ఎన్ ఎస్ ఆర్ అథ్లెటిక్స్ టీం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ జోనల్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంపులో భాగంగా, ఉచిత స్కిన్, హెయిర్ అనాలసిస్ వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల వైద్య పరీక్షలు రోగులకు నిర్వహించారు. కార్యక్రమానికి తాడేపల్లి టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి దారదాసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మైనారిటీ నియోజకవర్గ సభ్యులు షేక్ మస్తాన్ వలి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు,స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

355 రోజకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : చట్ట ప్రకారం తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 355వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకుడు కే స్టీవెన్, షైక్ సుభాని,ఎం సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో మహిళలు ఎం.శారద, బి.నవనీతం, డి.రమణమ్మ, వి.రిబ్కా, వేముల లక్ష్మి కూర్చున్నారు. కార్యక్రమంలో జి.అన్నమ్మ, కె.హగ్గయ్య, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కోలాహలంగా క్లాసికల్ డాన్స్ ప్రోగ్రాం

విజయవాడ : "విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ" ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ వి.హెచ్.గ్రంథాలయంలో "నేషనల్ లెవెల్ క్లాసికల్ డాన్స్ అండ్ మ్యూజిక్ ప్రోగ్రాం 14" కోలాహలంగా జరిగింది. శారద (రావులపాలెం), రమాదేవి (కాకినాడ), శారద, మనోజ్ఞ (గుంటూరు) సహా 14 మంది గురువుల ద్వారా- కర్ణాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది బాలికలు అనేక రకాల నత్యాలు చేసి ప్రేక్షకుల్ని రంజింపజేశారు. ముఖ్య అతిథిగా గాజుల శ్రీదేవి పాల్గొన్నారు. సినీ నటీమణులు నాగమణి, సునీత కూడా హాజరయ్యారు.

ఎస్‌సి, ఎస్‌టి యువతకు సివిల్స్ కోచింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు యుపిఎస్‌సి సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ ఆదివారం ఓ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 340 మంది నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సి సివిల్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 4 నెలల శిక్షణ కాలంలో (డిసెంబర్ 10 నుండి 2026 ఏప్రిల్ 10 వరకు) అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 26వ తేదీ వరకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని, దరఖాస్తుకు మరో మూడు రోజులే మిగిలి ఉన్నందున అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 30న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు https://apstudycircle.apcfss.in వెబ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు 'నాగార్జున' విద్యార్థులు

ప్రజాశక్తి - తిరువూరు : జన విజ్ఞానవేదిక (జెవివి) నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో తిరువూరు నాగార్జున పాఠశాల విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విస్సన్నపేట వికాస్ టెక్నో స్కూల్‌లో ఆదివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్సు సంబరాలలో బి.గ్రీష్మజ(8వ తరగతి), చరితశ్రీ (9వ తరగతి), టి.శ్రీనివాస్ (10వ తరగతి) పాల్గొని ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.నరసింహారావు తెలిపారు. విద్యార్థులకు జెవివి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వి.మురళీమోహన్, కార్యదర్శి ఎల్.గంగాధర్ రావు, వికాస్ విద్యాసంస్థల అధినేత నర్సిరెడ్డి బహుమతులు అందజేశారు.

సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా కళా ప్రదర్శనలను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర గాయకులు జగన్ పిలుపునిచ్చారు. మహాసభలు విజయవతం చేయాలని కోరుతూ స్థానిక రాణిగారితోటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజానాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరం శని, ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... సిఐటియు కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం సమరశీలంగా పోరాడుతున్న సంఘమని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు, త్యాగాలు చేస్తున్న సిఐటియు జాతీయ మహాసభలు వచ్చే నెలలో విశాఖపట్నంలో జరుగుతున్నాయని, వాటిల్లో కళాకారులు, కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కళ... కళ కోసం కాదని ప్రజల కోసమని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా వచ్చే నెల 27 నుండి జనవరి 4వ తేదీ వరకు శ్రామిక ఉత్సవ్ విశాఖపట్నంలో జరుగుతుందని, దానిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శ్రామిక ఉత్సవాలు పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.. కళాకారులకు పాటలు, కోలాటం, డాన్స్‌లలో రెండు రోజుల పాటు రాణిగారితోటలో శిక్షణ ఇచ్చారన్నారు. ఈ శిక్షణా శిబిరానికి రాష్ట్ర ప్రజానాట్యమండలి గాయకుడు జగన్ అనేక పాటలను కళాకారులకు నేర్పారన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు షేక్ ఖాశీం, రూబెన్ కోలాటంలో శిక్షణ ఇచ్చారు. ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పన్న పాటలు తాను పాడుతూ, నేర్పిస్తూ కళాకారులను ఉత్సాహపరిచారు .ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ .సి హెచ్.సుప్రజ, కార్యదర్శి ఏ.కమల, బాపట్ల జిల్లా అధ్యక్షులు వసంతరావు , పల్నాడు జిల్లా సిఐటియు కార్యదర్శి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-విజయవాడ : కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు మూడు సర్కిల్స్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని, దీనిని నగర ప్రజలు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

విజయవాడ : నాద క్షేత్రం (గుంటూరు), స్వర తరంగిణి (విజయవాడ), సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గాంధీనగర్ విద్యా భారతి శ్రవణ సదనం శివరామ క్షేత్రం (రామకోటి)లో.. ప్రశాంత.. ఆహ్లాదకర వాతావరణంలో- పాతికేళ్లలోపే పలు అవార్డులు సొంతంజేసుకున్న ముగ్గురు నవ యువ కళాకారులతో జరిగిన గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. మధుర గాయకుడు, శాస్త్రీయ, లలిత సంగీత విద్వాంసులు ప్రాతూరి వేంకట రమణమూర్తి సంస్మరణార్థం జరిగిన ఈ కార్యక్రమంలో గండూరి నాగేశ్వర శర్మ ఆలపించిన కీర్తనలు ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాయి. చెన్నైకి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని మదుల వేంకటాచలం (వయొలిన్), కె.కార్తికేయ ఆదినారాయణ శర్మ (మదంగం) సహకారం కచేరీని పండించింది. శుద్ధ ధన్యాసి రాగ వర్ణంతో కచేరీని ప్రారంభించి.. త్యాగరాజ వారి కీర్తనలు- వర వల్లభ రమణ.. బంటురీతి కొలువు.. మరుగేలరా ఓ రాఘవా.. గాన మూర్తీ... (ఆది తాళం.. హంసధ్వని రాగం), కద్దను వారికి... తోడి రాగంలో త్యాగరాజ కీర్తన ప్రధానాంశంగా సాగిన కచేరీని ప్రేక్షకులు పదేపదే హర్షధ్వానాలు చేసి ఆనందించారు. ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ దంపతులు తొలుత జ్యోతి ప్రజ్వలన గావించారు. ప్రాతూరి రఘునాథ్ (నాద క్షేత్రం), గండూరి శ్రీనివాసమూర్తి (స్వర తరంగిణి) కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ : "సుమాంజలి ఆర్కెస్ట్రా" ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై "సాయంకాల వేళ.. సరాగాల గోల.." మకుటంతో సినీ సంగీత విభావరి ఉత్సాహపూరితంగా జరిగింది. ప్రముఖ ఔత్సాహిక గాయని సుమతి) నిర్వహణలో దుర్గారావు, వాసు కీర్తన్, మల్లీశ్వరి, భారతి తదితర గాయనీ గాయకులు ఆయా సినిమాల్లోని హిట్ సాంగ్స్ పాడి ప్రేక్షకుల్ని అలరించారు. రాంబాబు (సౌండ్స్) సూర్య (ట్రాక్స్) కార్యక్రమ విజయవంతానికి దోహదపడ్డారు.

దుర్గగుడికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గగుడికి ఆదివారం యాత్రికులు భారీగా తరలివచ్చారు. ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మహా మండపం దిగువ ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఆలయంలో యాత్రికుల రద్దీ దృష్ట్యా ఈవో శీనా నాయక్ ఉద్యోగులతో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు రద్దీని దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు చేపట్టారు. కొండపైకి వచ్చే అన్ని విఐపి వాహనాలను ఓం టర్నింగ్ వద్ద నిలిపివేసి, అక్కడి నుండి వృద్ధులు విఐపి భక్తుల కోసం ప్రత్యేకంగా బ్యాటరీ వాహనాలను ఏర్పాటు చేసి కొండపైకి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణం, ఘాట్ రోడ్ కనకదుర్గ నగర్ ప్రాంతాలలో సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

జియో ట్యాగ్‌తో వాహనాలు భద్రం

- వెస్ట్ ఏసిపి దుర్గారావు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో (సితార) వివం రంగా జంక్షన్ వద్ద విజయవాడ వెస్ట్ జోన్ ఏసిపి దుర్గారావు, భవానీపురం సిఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహనాలు చోరీకి గురికుండా నివారించే చర్యల్లో ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలకు జియో ట్యాగ్ ఎక్కడ అమర్చాలి వంటి పలు సూచనలు చేశారు. అంతేకాకుండా వాహనానికి జియోట్యాగ్ అమర్చి ట్రైల్ కూడా నిర్వహించారు. వాహనాలకు జియోట్యాగ్ అమరిస్తే వాహనాలు చోరీకి గురవ్వకుండా ఉంటాయని, దానివల్ల వాహనదారుల విలువైన వాహనాలు వారి కంట్రోల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవానీపురం క్రైమ్ ఎస్సై ఆనంద్, రవితేజ, సుమన్, అనూష తదితర సిబ్బంది పాల్గొన్నారు.